
**కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి ధరలు**



2



2

**పంట నష్టపోయేలా విషపూరిత రసాయనాల పిచికారి..**


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## యెండల సువర్చలకు ఓయూలో డాక్టరేట్






**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఒప్పంద ఆధ్యాపకురాలిగా పనిచేస్తున్న యెండల సువర్చలకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ 85వ కాన్వికేషన్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'గ్రామీణ వెనుకబడిన వర్గాల బాలికల్లో విద్య: పాఠశాల అనుకూలత మరియు విద్యా పనితీరు పై ఒక అధ్యయనం' అనే అంశంపై సువర్చల పరిశోధన చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. మున్సిపల్, పంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. గత నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు లేక ఎదురుచూస్తున్న ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద ఎత్తున కార్యాలయాలకు వెళ్తున్నారు. అయితే అక్రమార్కులకు ఈ ప్రక్రియ లాభాలను తెచ్చిపెడుతోంది.
– అక్షరటుడే, కామారెడ్డి





- కామారెడ్డి బల్దియాలో వసూళ్ల పర్వం
- కొత్త పింఛన్ దరఖాస్తులకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు
- ముఖ్య నాయకులు, అధికారులు తెలుసని చెప్తున్న వసూలు రాయుళ్లు
- ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సిబ్బందే వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు
- వసూళ్లు చేస్తున్న వ్యక్తిని నిలదీసిన పలువురు స్థానికులు

# పింఛన్ కోసం పైసలియ్యాల్సిందే..

కామారెడ్డి బల్దియాలో పలు వార్డులకు సంబంధించిన అర్హులు పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. వితంతు, ఒంటరి మహిళ, బీడీ కార్మికులు, దివ్యాంగ పింఛన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది.దరఖాస్తుల స్వీకరణ కోసం కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తు ఆన్‌లైన్ చేసే సమయంలో సంబంధిత ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తే చెప్పాల్సి ఉండగా ఇందుకోసం కొందరు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా ఫోన్ చేయించి ఓటీపీ తీసుకుని వసూళ్లకు తెరలేపినట్టుగా ప్రచారం సాగుతోంది.

### దరఖాస్తుదారుల నుంచి..

ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని బల్దియాలో వసూళ్ల పర్వం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చేయూత పింఛన్ దరఖాస్తులకు రూ. వెయ్యి నుంచి 2 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉచితంగా జరగాల్సిన దరఖాస్తు ప్రక్రియకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

### ప్రైవేట్ వ్యక్తుల ద్వారా..

దరఖాస్తు ఆన్‌లైన్ చేసే సమయంలో సంబంధిత ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తే చెప్పాల్సి ఉండగా, ఇందుకోసం కొందరు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా ఫోన్ చేయించి ఓటీపీ తీసుకునే విధానాన్ని తెరపైకి తెచ్చారన్న ప్రచారం సాగుతోంది. ఈ ఓటీపీ ప్రక్రియను అడ్డుపెట్టుకుని ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సిబ్బందే వసూళ్లు చేయిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నేరుగా సిబ్బంది కాకుండా మధ్యవర్తులను పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంతో కామారెడ్డి మున్సిపాలిటీలో సిబ్బందిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలోనే ఈ వసూళ్లు జరుగుతున్నట్టుగా సమాచారం.

### నాయకులు, అధికారుల పేర్లతో వసూళ్లు

వసూళ్లకు పాల్పడుతున్న వారు తమకు ముఖ్య నాయకులు, అధికారులు తెలుసని చెప్తున్నట్టు సమాచారం. పలుకుబడి ఉన్న వారి పేర్లు చెప్పి దరఖాస్తుదారుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, నాయకుల అండతోనే ఇంత బహిరంగంగా వసూళ్లు చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### వసూళ్లు చేస్తున్న వ్యక్తి నిలదీత

ఇదిలా ఉండగా తాజాగా వసూళ్లు చేస్తున్న వ్యక్తిని పలువురు స్థానికులు నిలదీసినట్టు తెలిసింది. పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో కొంతమంది వద్ద ఒక్కొక్కరి వద్ద రూ.వెయ్యి నుంచి రెండు వేలు వసూలు చేసినట్టుగా సమాచారం. ఓటీపీ చెప్పాలంటూ ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిని పట్టుకుని స్థానికులు ప్రశ్నించడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో బల్దియాలో జరుగుతున్న వసూళ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు వ్యక్తి దొరికినా తనకు ఫలానా వ్యక్తులు తెలుసని చెప్పడం గమనార్హం. దాంతో స్థానికులు అతడిని పోలీసులకు అప్పగించినట్టుగా సమాచారం. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### విచారణ జరిపేనా..?

కామారెడ్డి బల్దియాలో జరుగుతున్న ఈ వసూళ్ల పర్వంపై ఉన్నతాధికారులకు తెలుసా లేదా అనేది తెలియాల్సి ఉంది. సామాన్య ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు దృష్టి సారించకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుదారుల ద్వారా పూర్తిస్థాయిలో విచారణ జరిపితే ఎంతమంది వద్ద వసూళ్లు చేశారు.. ఈ వసూళ్ల వెనక ఉన్నదెవరు అనేది తెలిసే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల కొత్త పింఛన్లు ఇస్తామని చెప్పింది. అయితే దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. దీంతో పైసలు ఇస్తే పింఛన్ వచ్చేలా చేస్తామని కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు.

## రేవంత్‌రెడ్డికి మహిళల ఉసురు తగులుతుంది : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి:** అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని, సీఎం రేవంత్ రెడ్డికి మహిళల ఉసురు తప్పక తగులుతుందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం కామారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని రైల్వే కమాన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత ఒక్కసారిగా రైల్వే కమాన్ పైకి ఎక్కి బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు 20 నిమిషాల పాటు కమాన్‌పై నిరసన కొనసాగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. నిరసన విరమించకపోవడంతో పోలీసులు మాజీ ఎమ్మెల్యేను బలవంతంగా లేపి ఆయన కారులో ఎక్కించి ఇంటికి పంపే ప్రయత్నం చేశారు. దీన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. కారు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు కార్యకర్తలను పక్కకు తప్పించి కారును అక్కడి నుంచి పంపించారు. గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముజీబోద్దీన్, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ ధర్నా..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై దాడిని ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో మహిళా నేతలు ధర్నాకు దిగారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా ధర్నా చౌక్‌లో వారు ధర్నా నిర్వహించారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ దండు నీతుకిరణ్, విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ, మంజుల యాదవ్, చింతకాయల అలేఖ్య, గంగ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** ఎన్సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న బీఈడీ కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస్‌యూ, డీఎస్‌వో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ..తెయూ పరిధిలోని పలు బీఈడీ కళాశాలలు నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అధిక మొత్తంలో ఫీజులు, అడ్మిషన్ సమయంలోనే అటెండెన్స్ ఫీజు పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అర్హత కలిగిన ఫ్యాకల్టీ, సొంత భవనం, ల్యాబ్‌లు, లైబ్రరీ, మౌలిక వసతులు లేకపోయినా అఫిలియేషన్ ఇవ్వడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా కొన్ని కళాశాలలు కోర్టు నుంచి తాత్కాలిక అనుమతులు పొందుతూ కొనసాగుతున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు కౌంటర్ దాఖలు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కోర్టు ఒక్కో ఏడాదికే అనుమతి ఇస్తున్నా ఇప్పటికీ సొంత భవనాలు నిర్మించుకోని కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల వైఫల్యమని విమర్శించారు. థామస్, చైతన్య, ప్రియదర్శిని వంటి బీఈడీ కళాశాలల్లో కనీస అర్హత కలిగిన అధ్యాపకులు, మౌలిక వసతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రఘురాం, విగ్నేష్, అనిల్, గోపీచంద్, గోపాల్ సింగ్ ఠాగూర్, చందు, వినీత్, సూర్యపాల్, ఆజాద్, సునీల్ పాల్గొన్నారు.



## బోధన్‌లో ఉద్రిక్తత.. బాహాబాహికి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

**అక్షరటుడే, బోధన్:** కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బాహాబాహికి దిగడంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపేందుకు అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒక్కసారిగా చౌరస్తా వద్ద ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అయితే స్పీకర్‌ను అవమానించిన బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్‌కు వినతిపత్రం ఇచ్చే నైతిక హక్కు లేదని పేర్కొంటూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, ఆదినారాయణ, మీర్ గౌస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకు దాము, బీఆర్ఎస్ నాయకులు ముషీర్, బాబా, మోబిన్ ఖాన్, గుమ్ముల అశోక్ రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు రాజీనామా చేయాలి

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధు ఉద్దేశ్యపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక మాజీ సీఎం కేసీఆర్ ప్రోద్బలం ఉందని ఆరోపించారు. కేసీఆర్, ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్, ఈఆర్‌వో కోఆర్డినేటర్ అబ్దుల్ వహీద్, టౌన్ డీసీసీ ఉపాధ్యక్షుడు సలీం, కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్, గంగాధర్, మెంబర్ బొబ్బిలి మురళి, సకినాల శివ ప్రసాద్, జిల్లెల రమేష్, అమరాజు, సాయి బసవ, వహీద్, అపర్ణ, ఆకుల శ్రీశైలం, మల్లేష్ యాదవ్, బండారు రమేష్, మహమ్మద్ సముద్దీన్, సయ్యద్ అర్షద్, షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి





**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మండపాలు ప్రతిష్ఠించాలని సూచించారు. ఎనిమిది అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. మండపాల వద్ద డీజే సౌండ్లను నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. మేయర్ ఉమారాణి, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ పాల్గొన్నారు.

## జీపీ రికార్డుల ధ్వంసంపై ఎంపీడీవోకు ఫిర్యాదు



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి గ్రామ పంచాయతీ రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు సర్పంచ్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీవో అభినవ్ చందర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను, ఇతర సామగ్రిని ధ్వంసం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా ధ్వంసం చేస్తే వారి పైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వారంక్రితం సముందర్ తండా గ్రామ పంచాయతీలో మంచి నీటి పైపులైన్ కూడా ధ్వంసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన



**అక్షరటుడే, ముప్కాల్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలివి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలల విలీనాన్ని ఖండిస్తున్నాం




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి, వైఐఎస్‌యూలో విలీనం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీజేఏసీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పాలిటెక్నిక్ వద్ద మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ వ్యవస్థ 70 ఏళ్లుగా అత్యంత నిరుపేద, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య అందిస్తోందన్నారు. 95శాతం ప్రవేశాలతో విజయవంతంగా నడుస్తున్న పేదల విద్యా వ్యవస్థను దేంట్లో విలీనం చేసిన వారికి అన్యాయం చేసిన వారవుతారని పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌లను శక్తిలో విలీనం చేయవద్దని..కమిటీ త్వరగా సమావేశమై సానుకూల నివేదిక ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాడాలని కోరారు.

కూర ఏదైనా.. ఉల్లిపాయ పడాల్సిందే.. కానీ, ఇప్పుడు ఆ ఉల్లిపాయ వైపు చూడాలంటేనే సామాన్యుడి కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. వంటగదిలో రారాజుగా వెలిగే ఉల్లి ధర ఇప్పుడు ఆకాశాన్ని తాకుతుండటంతో మధ్యతరగతి, పేద కుటుంబాలు కొనే పరిస్థితి లేకుండా పోయింది.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



# కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి ధరలు

■ నెల రోజుల్లోనే భారీగా పెరిగిన రేట్లు.. ■ షాక్ అవుతున్న సామాన్యులు

నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి ధరలు రెట్టింపు కావడం ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపుతోంది. మార్కెట్‌కు వెళ్తే రూ.వంద నోటు క్షణాల్లో కరిగిపోతోంది. గత జూలై నెలలో ఎల్లారెడ్డి పట్టణంలో కిలో ఉల్లిపాయలు రూ. 25-30కి లభిస్తే, ఇప్పుడు ఏకంగా రూ. 65 నుంచి రూ.70 చేరింది. కామారెడ్డిలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. నెలక్రితం వరకు కేజీ కొన్నచోట.. ఇప్పుడు అరకేజీ, పావుకేజీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రెక్కాడితే గాని డొక్కాడని సామాన్యుడు, రోజువారీ కూలీలు కూరల్లో ఉల్లిపాయలు వేసుకోవడం ఒక విలాసంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు చూస్తేనే భయమేస్తోంది, ఇక ఉల్లిపాయలు లేకుండా వంట ఎలా చేయాలో అర్థం కావడం లేదు అంటూ గృహిణులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

### పడిపోయిన సప్లయ్..

తెలుగు రాష్ట్రాలకు ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ఉల్లి దిగుమతి అవుతుంది. అయితే ఈసారి అక్కడ ఉల్లి దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే లారీల సంఖ్య బాగా తగ్గిపోయింది. మార్కెట్‌కు రోజూ సగటున 100 లోడ్ల ఉల్లిగడ్డలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం 52 లోడ్లకు పడిపోయింది. మార్కెట్లకు సప్లై సగానికి సగం పడిపోవడంతో హోల్‌సేల్ మార్కెట్ లో క్వింటా ధర విపరీతంగా పెరిగింది. దీని ప్రభావం నేరుగా సామాన్యుడి జేబుపై పడింది.

### అక్టోబర్ వరకు ఆగాల్సిందేనా..?

మన రాష్ట్రంలో మహబూబ్‌నగర్, తాండూరు, మెదక్, నల్లగొండ తదితర ప్రాంతాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతున్నప్పటికీ, స్థానికంగా పండే ఈ పంట అక్టోబర్, నవంబర్ నెలల్లో మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు పొరుగు రాష్ట్రాల దిగుమతుల పైనే ఆధారపడక తప్పదు. స్థానిక పంట చేతికి వస్తేనే ధరలు కాస్త దిగివస్తాయని, అప్పటివరకు ఈ ఉల్లి ఘాటును భరించక తప్పదని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వాలు స్పందించి రాయితీ ధరలపై ఉల్లిని అందించి ఆదుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు.



## అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై మంగళవారం 20వ డివిజన్‌లోని ఎల్లమ్మగుట్ట ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల సురేష్ ఆధర్వంలో జనసేన జిల్లా నాయకులు గుండా సంతోష్‌తో కలిసి హెచ్‌పీవీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. న్యాలంరాజు మాట్లాడుతూ..వ్యాక్సిన్ ప్రాధాన్యతను వివరించారు. స్కూల్ ప్రిన్సిపల్ రమణ, న్యూ ప్రియదర్శిని స్కూల్ ప్రిన్సిపల్ పుష్పలత ప్రకాష్, నవీన్, దీపక్, మహేష్, గోపి, బబ్లు, కార్తీక్, సుమంత్, విగ్నేష్, లక్ష్మణ్, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.




## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం..

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** పెద్ద కొడప్‌గల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి బలరాం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు అధికారులు, సర్పంచుల గైర్హాజరుతో ఈ సమావేశం సాదాసీదాగా ముగిసింది. బాబుల్‌గావ్ గ్రామంలో గత 8 నెలలుగా తీవ్ర నీటి ఎద్దడి వేధిస్తున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్, మిషన్ భగీరథ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తీర్చకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

## డిచ్‌పల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క సాయిబాబా, అధికార ప్రతినిధిగా గర్క సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా నమిల్ల రామచంద్ర, కార్యనిర్వహణ అధ్యక్షులడిగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, చిన్న సాయిలు, రమేష్, కోశాధికారిగా నరేష్, కార్యదర్శిగా మోహన్, సహాయ కార్యదర్శిగా గంగాధర్, సహాయ కార్యదర్శిగా బాబు ఎన్నికయ్యారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాలల పోరుబాట



**అక్షరటుడే, బోధన్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాలలు పోరుబాట పట్టాయి. బోధన్ పట్టణంలో కళాశాలలను మూసివేసిన యాజమాన్యాలు నిరసన తెలిపాయి. 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న బోధనారుసుము బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉషోదయ డిగ్రీ కళాశాలలు బంద్ నిర్వహించాయి. ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. ఆర్‌టీఎఫ్ (RTF) బకాయిలు విడుదల కాకపోవడం మూలంగా జరిగే ఇబ్బందులను విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించామన్నారు.

## ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమేష్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు సక్రమంగా ఉన్నాయా లేదా ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న వారు సంబంధిత బీఎల్‌వోలను (బూత్ లెవల్ ఆఫీసర్లు) సంప్రదించి అవసరమైన వివరాలు అందిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేకపోతే, పేర్లు లేదా వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు బీఎల్‌వోలను సంప్రదించాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ కట్ట నర్సయ్య మాట్లాడుతూ.. ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు




**అక్షరటుడే, మాక్లూర్:** మాణిక్ బండార్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు స్కూటీపై వెళ్తున్న ఆమెను ప్రైవేటు బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన స్థానికులు అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ముబారక్ నగర్‌కు చెందిన ఆమె డిచ్‌పల్లి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## వరి పంటపై విషపూరిత రసాయనాల పిచికారి..



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వరిపంటకు నష్టం వాటిల్లేలా విషపూరిత రసాయనాలు పిచికారీ చేయడంతో పచ్చని పొలం కాస్త ఎండిపోయిది. ఈ ఘటన డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. డిచ్‌పల్లి మండలం సాంపల్లి గ్రామంలో రైతు సంగి గోపాల్‌కు చెందిన వరి పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత విషపూరిత రసాయనాలను పిచికారి చేశారు. దీంతో వరి పైరు తీవ్రంగా దెబ్బతిని ఎండిపోయింది. వరి పంటకు నష్టం జరిగిన విషయాన్ని గుర్తించిన బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై అరీఫ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించి అనుమానితులు ఎవరైనా ఉన్నారా అనే విషయమై రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. దుండగులు అత్యంత విషపూరిత రసాయనాలు పిచికారీ చేయడంతోనే వరి పైరు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయినట్లు ఏఈవో జ్ఞానేశ్వర్ ప్రాథమికంగా నిర్ధారించారు.

## ఎఫ్‌పీవో సభ్యులకు ఈక్విటీ గ్రాంట్ సర్టిఫికెట్ల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, తాండూర్ కిచ్చన్నపేట ఆధ్వర్యంలో ఎఫ్‌పీవో సభ్యులకు ఈక్విటీ గ్రాంట్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ఎఫ్‌పీవోలో మొదటి విడతగా రూ.2,000 చెల్లించి సభ్యత్వం పొందిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఈక్విటీ గ్రాంట్ సర్టిఫికెట్లను అందజేశారు. గంగారెడ్డి మాట్లాడుతూ.. తాండూర్ కిచ్చన్నపేట ఎఫ్‌పీవోలో మొత్తం 750 మంది రైతులకు సభ్యత్వం కల్పించే అవకాశం ఉందని తెలిపారు. మొదటి విడతలో 303 మంది రైతులు సభ్యులుగా చేరారని, వారికి ప్రభుత్వం నుండి గ్రాంట్ మంజూరైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎఫ్‌పీవో సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటి వరకు మొత్తం 520 మంది రైతులు సభ్యత్వం పొందారని వెల్లడించారు. త్వరలోనే సభ్యుల లక్ష్యాన్ని పూర్తి చేసి, రైతులకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలపై దాడులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలు దుకాణాలు, జ్యూస్, టిఫిన్ సెంటర్లపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలకు జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం నగరంలోని పలు టిఫిన్ సెంటర్లు, కిరాణా షాపులు, హోటళ్లలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. పలు దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానాలు విధించారు. మున్సిపల్ శానిటరీ సూపర్వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

